సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 9 । మే । 2025



కమనీయం.. కూర్మనాథుని కల్యాణం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవం గురువారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ముందుగా గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు తిరువీధి నిర్వహించి మత్స్యనారాయణ ఆలయం సమీపంలో పెళ్లి చూపుల కార్యక్రమం నిర్వహించారు. ఆస్థాన మంటపంలో అలంకరించిన వేదికపై కల్యాణమూర్తులను వేంచింపచేసి కల్యాణ ఘట్టాన్ని పండితులు ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, దానుబాబు, పద్మనాభాచార్యులు, కిశోర్‌బాబులతో పాటు వేదపండితుల వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం జరిగింది.

న్యూస్‌రీల్

పత్రికల గొంతు నొక్కేయడం సరికాదు



ప్రభుత్వం చేస్తున్న అన్యాయాల్ని, అక్రమాల్ని ప్రజలకు తెలియజేసేందుకే ప్రతికలు ఉన్నాయి. అలాంటిది ఎడిటర్ స్థాయి వ్యక్తి ఇంటిలో పోలీసులు తనిఖీలు చేసి భయపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

– కంఠ వేణు, దళిత సంఘాల జేఏసీ నాయకుడు

పత్రికా స్వేచ్ఛకు భంగం



పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉండదు. ఎడిటర్ ఇంటికి ముందస్తు సమాచారం లేకుండా వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం హేయం. ప్రజలకిచ్చిన హామీలను అమలుచేసి ప్రజాసంక్షేమానికి పాటుపడాలే తప్ప ఇలా దాడులు చేయడం సరికాదు.

– డి.గణేష్, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి

తలసేమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రం



వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా బాధితుల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఏర్పాటు చేసిన రక్తమార్పిడి కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం తలసేమియా బాధిత పిల్లలకు రక్తమార్పిడి జరుగుతుందని, అవసరమైన వైద్యపరీక్షలు చేయిస్తామని తెలిపారు. రానుపోను రవాణా ఖర్చులు, పౌష్టిక ఆహారం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరుగురికి రక్త మార్పిడి చేయగా, శివాని గ్రూప్ ఆఫ్ కాలేజీలకు చెందిన 30మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

'మావోయిస్టులతో చర్చలు జరపాలి'



మాట్లాడుతున్న మోహనరావు

పలాస: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వివిధ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డపాడు జిల్లా అమర వీరుల స్మారక మందిరంలో గురువారం ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా సదస్సు జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న యుద్ధం వల్ల దండకారణ్యంలో ఆదివాసీల జీవితాలు ఛిద్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 14 నెలల్లో 450 మంది ఆదివాసీలను అమానుషంగా హత్య చేశారని, ఇది అప్రజాస్వామ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ సీఎల్సీ నాయకుడు దానేసు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఎం జిల్లా నాయకుడు కె.మోహనరావు, లిబరేషన్ నాయకులు దుష్యంత్, మద్దిల రామారావు పాల్గొన్నారు.

కలం గళంలో నిరసన స్వరం



సర్కారు నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా ధిక్కార స్వరమొకటి వినిపించింది. పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడికి నిరసనగా అక్షర శరమొకటి హెచ్చరిక జారీ చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగిస్తూ కలాలన్నీ గళమెత్తాయి. అణచివేత ప్రభుత్వ నైజమైతే.. పోరాటం పాత్రికేయుల పంథా అని తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా మీడియా ప్రతినిధులు ఆందోళనలు చేశారు. 'సాక్షి' ఎడిటర్‌పై ప్రభుత్వ కక్ష సాధింపులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

అక్రమ సోదాలు సరికాదు..

రాజకీయ రెడ్ బుక్ తెరిచి జర్నలిస్టులు, ఎడిటర్లపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎవరిది తప్పుంటే వారిపై న్యాయస్థానాలు అంతిమ తీర్పు వెలువరిస్తాయి. ఇలా దాడులు చేయడం రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే.

– కొంక్యాణ వేణుగోపాల్, ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి

బ్రిటీష్ పాలనకు వారసత్వం..



ఒక ఎడిటర్ ఇంట్లో పోలీస్ సోదాలు బ్రిటిష్ పాలనా కాలంలో జరిగాయని చదివాం. స్వాతంత్ర్య భారత చరిత్రలో ఇలా ఏనాడూ జరగలేదు. కూటమి ప్రభుత్వం సొంత రాజ్యాంగం తయారు చేసుకుందేమో. డాక్టర్ అంబేడ్కర్ చూపుడు వేలులా ప్రశ్న జీవిస్తూనే ఉంటుంది. ఎడిటర్ ఇంట్లో అక్షరాలు తప్ప మారణాయుధాలు ఉండవు గదా.. కూటమి ప్రభుత్వం బాగా దిగజారిపోతోంది.

– నల్లి ధర్మారావు, స్వామ్నా రాష్ట్ర అధ్యక్షులు

- 'సాక్షి' ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసుల అక్రమ సోదాలపై అక్షరాగ్రహం
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడిన శ్రీకాకుళం జర్నలిస్టు సంఘాలు



టెక్కలి ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలి వద్ద జిల్లా జర్నలిస్టు సంఘాల ధర్నా

భయభ్రాంతులకు గురిచేస్తూ..



సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కూటమి ప్రభుత్వం పూర్తి కక్ష పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఎటువంటి సెర్చ్ వారెంటు లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంట్లో పోలీసులు సోదాలు జరిపి గంటల తరబడి తలుపులు మూసి భయభ్రాంతులకు గురిచేయడం సరి కాదు.

– ఎస్.ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైమ్ :

'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల అక్రమ సోదాలకు నిరసనగా పాత్రికేయ లోకం గళమెత్తింది. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో జిల్లా జర్నలిస్టు సంఘాలు నల్ల రిబ్బన్లు కట్టుకుని, చేతిలో ప్లకార్డులతో ధర్నా చేసి నిరసన తెలిపాయి. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీగా స్థానిక తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. ఎడిటర్ ధనుంజయరెడ్డికి సంఘీభావాన్ని తెలుపుతూ.. ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరు తూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఒకప్పటి బ్రిటిష్ పాలనకు వారసత్వపు హక్కులా ప్రస్తుత కూటమి పాలన ఉందని, పూర్తి కక్షసాధింపు చర్యలకు దిగుతుందని, రాజకీయ రెడ్‌బుక్ తెరిచి పత్రికా ఎడిటర్లు, జర్నలిస్టులపై అరాచక విధానానికి సరికొత్త నాంది పలుకుతున్నారని శ్రీకాకుళం జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సెర్చ్ వారెంటు లేకుండా గురువారం ఉదయం విజయవాడలోని ఆయన నివాస గృహంలో పోలీసులు సోదాలు జరపడం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్,ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.ఈశ్వరరావు, సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జిలు కడారి రాజా, పి.చినప్పలనాయుడు, టీవీ బ్యూరో సునీల్, సీనియర్ జర్నలిస్టులు యు.శ్రీనివాస్, వీవీఎన్ శ్రీనివాస్, బగాది అప్పలనాయు డు, శివప్రసాద్, భీమారావు, షణ్ముఖ, రవి, అప్పలనాయుడు, రామకృష్ణ, భీమారావు, జగదీష్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కక్ష సాధింపు మంచిది కాదు



కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రశ్నిస్తున్న సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదు. పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం, అక్రమ సోదాలు వంటి అప్రజాస్వామ్యకమైన చర్యలు సరికాదు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సాక్షి దినపత్రిక గొంతు నొక్కే ప్రయత్నంగా ఎడిటర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

ముమ్మాటికీ కుట్రపూరిత చర్యే..



ఎన్నికల మునుపు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ అక్రమాలపై కథనాలు రాస్తున్న సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కుంటి సాకులతో అక్రమంగా సోదాలు చేయడం కుట్ర పూరిత చర్య అని అందరికీ అర్థమైంది.

– సింగుపురం మోహన రావు, న్యాయవాది,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, టెక్కలి

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు



ఏపీలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు పడ్డాయి. కూటమి ప్రభుత్వం 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు చేయడం మంచి పద్ధతి కాదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా ఎడిట ర్ ఇంటిలోకి వెళ్లి సోదాలు చేయడం మంచి పద్ధతి కాదు.

– పేడాడ శ్రీరామమూర్తి, న్యాయవాది, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

పండగలేమో ఊరివి.. సంబరాలు ఆ శాఖవి..



- కుందువానిపేటలో మద్యం విక్రయాలకు వేలంపాట
- రూ.4లక్షలకు పాట దక్కించుకున్న వైనం
- దొడ్డిదారిన అనుమతులు ఇస్తున్న ఎక్సైజ్ అధికారి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

శ్రీకాకుళం రూరల్:

కల్లేపల్లి, కణుగులవాని పేట పంచాయతీల్లో మరో వారం రోజుల్లో అమ్మవారి పండుగలు జరగనున్నాయి. అలాగే ఈ నెల 20న బలివాడ, కుందువానిపేట గ్రామాల్లో సైతం అమ్మవారి పండుగలకు గ్రామపెద్దలు శ్రీకారం చుట్టారు. గమ్మత్తు ఏమిటంటే పండగలు మాత్రమే ఊళ్లవి.. అసలు సంబరాలు ఎక్సైజ్ శాఖవి. పండగ రోజుల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలకు ఎక్సైజ్ అధికారులు దగ్గరుండి వేలంపాట పాడించారు. నెల రోజుల కిందట కుందువానిపేట గ్రామానికి చెందిన కొందరు ఊరిపాటలో ఏకంగా రూ.4లక్షలకు బెల్టుషాపును నిర్వహించేందుకు పాటను కైవసం చేసుకున్నారు. ఈ గ్రామం నుంచి చుట్టు పక్కల గ్రామాలు సైతం బాటిల్‌పై ఎంత పెంచి అమ్మినా ఇక ఎక్సైజ్ అధికారులు పట్టించుకోరు. ఈ ఊరిపాటను ధిక్కరించి కొత్త బెల్టుషాపులు పెడితే మాత్రం ఎక్సైజ్ అధికారులు ఫైన్‌లు వసూలు చేసేలా ఆ గ్రామపెద్దలు నిర్ణయం చేశారు.

ప్రతి వైన్‌షాపులోనూ అదనపు ధరలు

ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ మండలాల్లో గల కల్లేపల్లి, రాగోలు, సింగుపురం, ఎస్ఎస్‌వలస, వప్పంగి, అలికాం గ్రామాల్లో వైన్‌షాపులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుమతులు ఇచ్చారు. ఈ షాపులను అనుసరించి విక్రయిస్తున్న మద్యంకు అదనంగా ప్రతి బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక వైన్‌షాపుల నుంచి బెల్ట్‌షాపులు వెళ్లే కొద్దీ ఒక్కో బాటిల్‌పై దూరాభారాన్ని బట్టి రూ. 20 నుంచి రూ.50 వరకు లాగేస్తున్నారు. ఈ వేలంపాటలు, నిర్ణయాలు అన్నీ ఎక్సైజ్ అధికారి కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. ఇంత వ్యవహారం జరిగినా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పరిశీలిస్తాం..

గ్రామాల్లో బెల్టు షాపులు గానీ, ఊరిపాటలకు గానీ ఎలాంటి అనుమతులు లేవు. ఎమ్మార్పీ ధర కంటే అధికంగా వైన్‌షాపుల్లో ఎవరైనా అధిక వసూళ్లకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ శాఖలో ఏ అధికారైనా బెల్టుషాపుల నిర్వహణ, ఊరిపాటల్లో పాల్గొని ఉంటే అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

– తిరుపతినాయుడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్



కల్లేపల్లిలోని మద్యం దుకాణం

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న సాందీప్ శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం గురువారం ఉదయం ఘనంగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారి కల్యాణ మూర్తులను అనివెట్టి మండపంలో ఉంచి ఆగమశాస్త్రం ప్రకారం అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించగా, రూ.500 చెల్లించిన భక్తదంపతులు కల్యాణ సేవలో పాల్గొని స్వామి వారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

దాహార్తి తీరుస్తున్న దాతలు



- బాటసారులకు బాసటగా చలివేంద్రాలు
- వాడవాడలా ఏర్పాటు

శ్రీకాకుళం కల్చరల్ : ఎండలు మండిపోతున్నాయి. అత్యవసర పని ఉంటేనే తప్ప బయటకు రాలేని పరిస్థితి. ఇలా వివిధ పనుల కోసం రోడ్డుపైకి వచ్చేవారికి చలివేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. దాదాపు ప్రతి కూడలిలోనూ మంచినీరు, మజ్జిగ అందిస్తూ దాహార్తి తీరుస్తున్నాయి. దాతల సాయంతో జిల్లా కేంద్రంతో పాటు గ్రామ కూడళ్లలోనూ చలివేంద్రాలు దర్శనమిస్తున్నాయి.

ముందుకొస్తున్న దాతలు..

చలివేంద్రాల ఏర్పాటులో దాతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఒకరోజు ఏర్పాటు చేస్తుంటే, మరికొందరు రెండు నెలలకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల మంచినీరుతో పాటు మజ్జిగ, గ్లూకోజ్ నీరు సైతం అందిస్తున్నారు.

ప్రధాన కూడళ్లలో..

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్, పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం, కోదండ రామాలయం, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పెద్దమందిరం సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు కొంత కాలంగా క్రమంతప్పకుండా చలివేంద్రం నిర్వహిస్తున్నారు.



కోదండ రామాలయం వద్ద ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రతిఏడాది ఏర్పాటు



వేసవిలో ప్రతి ఏడాది నిర్వహిస్తుంటాం. దాతలు సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారు. దాహార్తులకు మజ్జిగ అందిస్తున్నాం.

– ఇప్పిలి హరి, ధర్మకర్త, విజయగణపతి ఆలయం, శ్రీకాకుళం

మజ్జిగ అందిస్తున్నారు



నేను షాపులో పనిచేసేందుకు నగరానికి వస్తుంటాను. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో చలివేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. చల్లటి మజ్జిగతో దాహార్తి తీరుతోంది.

– నాగరాజు తారకేశ్వరరావు, బాదుర్లపేట



విజయగణపతి ఆలయం వద్ద మజ్జిగ కోసం క్యూ

బ్యారేజ్.. డెడ్ స్టోరేజ్!



జిల్లాకు వర ప్రదాయిని గొట్టా బ్యారేజీ డెడ్ స్టోరేజీతో దర్శనమిస్తోంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానుంది. అడపాదడపా వర్షాలు పడుతున్నా బ్యారేజీలోకి నీరు చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒడిశా ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. ఏటా ఈ సమయానికి ఎంతో కొంత నీరు ఉండేది. కానీ ఈ సారి పూర్తిగా అడుగంటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు బ్యారేజీకి సంబంధించి గేట్లు లీకులు కావడంతో కిందకు వృథాగా నీరు పోయింది.

- హిరమండలం

క్లుప్తంగా

ఉపాధి వేతనదారు మృతి


పార్వతి(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు అనపాన పార్వతి(45) గురువారం మృతిచెందింది. గ్రామ సమీపంలో ఉపాధి పని చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తోటి కూలీలు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా మృతిచెందింది. వడదెబ్బ తగలడం వల్లే మృతిచెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పార్వతికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామం వద్ద అలికాం-బత్తిలి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్లెమ్మ గ్రామానికి చెందిన బొడ్డు నానాజి, తన భార్యతో కలిసి భామిని నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులు, యువకుడు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బి.గోవిందరావు తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్‌గా తాతయ్య


చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం జిల్లా చైర్మన్‌గా కుజ్జ తాతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈడీ డాక్టర్ బి.యోగేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారి డాక్టర్ పి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ ఎన్నికలో సంఘం ఉపాధ్యక్షులుగా పల్ల నరహరితో పాటు 11మంది సభ్యుల్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేడీ బి.రాజగోపాల్, పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ టి.పి.మనోజ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, సంఘంలో 123 మంది ఓటర్లు ఉన్నప్పటికీ నామమాత్రంగా హాజరై ఎన్నిక మమా అనిపించేశారు. మంత్రి సిఫార్సు చేసిన వారికే చైర్మన్, ఉపాధ్యక్ష పదవుల్ని కట్టబెట్టారని పలువురు సంఘ నాయకులు ఆరోపించడం గమనార్హం.

ఆదిత్యుని సన్నిధిలో సినీ గాయకులు శ్రీకృష్ణ, యామిని


జ్ఞాపిక అందుకుంటున్న గాయకులు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ గాయకులు శ్రీకృష్ణ, యామినిలు గురువారం దర్శించుకున్నారు. తొలిసారిగా ఆదిత్యున్ని దర్శించుకోవడం నిజంగా తమ అదృష్టమని వారు తెలియజేశారు. వీరికి ఆలయ అధికార వర్గాలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.


సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయ పనివేళల్లో తగిన ఆధారాలతో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించి తాత్కాలిక సీనియారిటీ జాబితాపై ఆర్జేడీ కార్యాలయంలో అభ్యంతరాలను ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తగిన ఆధారాలతో సమర్పించాలని డీఈఓ పేర్కొన్నారు.

దళారులు చెప్పిందే ధర!

- ఉద్దానంలో జీడి పిక్కల అమ్మకాలు ప్రారంభం
- ఒక్కో గ్రామంలో ఒక్కో రేటు
- రైతుకు దక్కని మద్దతు ధర


ఎర్రముక్కాంలో జీడి పిక్కల అమ్మకాలు



పలాస: మద్దతు ధరపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఉద్దానంలో జీడిపిక్కల రైతులు అన్యాయానికి గురవుతున్నారు. దళారులు చెప్పిన ధరకే పిక్కలు అమ్ముకుంటున్నారు. ఇటీవలే పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జీడి పిక్కల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. తోటల్లో మార్చి నుంచి సేకరించిన జీడిపిక్కలను ప్రస్తుతం అమ్మకాలు చేపడుతున్నారు. అయితే పలాస మార్కెట్‌లో 80 కిలోల బస్తా ధర రూ.13,500 ఉందని పలాస పారిశ్రామికవాడ జీడి ఉత్పత్తులదారుల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు చెబుతున్నారు. అయితే మూడు నెలల తర్వాత మాత్రమే చెల్లింపులు జరుగుతాయని అంటున్నారు. మరోవైపు గ్రామాల్లో ఒక్కో చోట ఒక్కో ధర వినిపిస్తోంది. వజ్రపుకొత్తూరు మండలం పెద్ద బొడ్డపాడు గ్రామంలో రైతులు తమ గ్రామానికి వచ్చిన చిల్ల వర్తకులు(దళారులు)కు మార్కెట్ ధరతో సంబంధం లేకుండా బస్తా ధర రూ.12వేలుకు విక్రయిస్తుండగా, సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామంలో బస్తా ధర రూ.13000కు రైతులు అమ్మకాలు చేపట్టారు. పలాస మండలం బొడ్డపాడు పరిసర గ్రామాల్లో మాత్రం రూ.13,500 బస్తా ధర పలుకుతోంది. అయితే ఈ గ్రామాల్లో ధర ఇంకా నిర్ణయం కాలేదు.

కానరాని సమావేశాలు..

గ్రామాల్లో ప్రజలంతా ఒక చోట సమావేశమై మార్కెట్ ధరను పరిశీలించి పలాస వ్యాపారులతో సంప్రదించాక జీడిపిక్కలు ధర నిర్ణయించడం ఆనవాయితీ. ఈసారి మాత్రం గ్రామాల్లో ఇంకా అటువంటి సమావేశాలు జరగలేదు. గ్రామ కమిటీలు ధర నిర్ణయించలేదు. త్వరలో సమావేశాలు జరుగుతాయని, అప్పటి వరకు జీడి పిక్కలను అమ్మరాదని ఆయా గ్రామాల ప్రజలకు గ్రామ కమిటీలు పెద్దలు చెబుతున్నారు. జీడి పిక్కల రైతాంగ కమిటీలు మాత్రం గత కొన్నేళ్లుగా జీడి మద్దతు ధర కోసం పోరాటాలు చేస్తున్నారు. కనీస మద్దతు ధర 80 కిలోల బస్తాకు రూ.16వేలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఈ ధరలు పెరుగుతాయా లేక ఇంతకన్నా తక్కువకు దిగజారుతాయా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. రైతు సమాజంలో పండించిన అన్ని పంటలకు అన్నిచోట్లా ఒకే ధర ఉండగా జీడి పిక్కలకు మాత్రం ఎప్పుడు కూడా ఒక ధరంటూ లేకపోవడం గమనార్హం. రైతు చేతిలో ధర లేదనేది మాత్రం వాస్తవం. పలాస వ్యాపారులు ఏది చెబితే అదే రేటనే అపవాదు మాత్రం ఒకటి ఉంది. ఈ ఏడాది ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ధర విషయం ఏం చేస్తారో వేచి చూడాల్సిందేనని జీడిపిక్కల రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మోసపోతున్నారు..



జీడి రైతులు ప్రతి ఏడాది దళారుల చేతిలో మోసపోతున్నారు. ఉద్దానం జీడి రైతులు మద్దతు ధర కోసం ప్రతి ఏడాది పోరాడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ప్రభుత్వాలు ఎన్నికల్లో మద్దతు ధర ఇప్పిస్తామని హామీలు ఇస్తున్నారు. ఆ తర్వాత వ్యాపారులతో కలిసిపోతున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని దోపిడీ చేస్తున్నారు. మద్దతు ధర విషయంలో అధికార పార్టీ మాట నిలబెట్టుకోవాలి.

– తెప్పల అజయ్‌కుమార్, రైతు, మాకన్నపల్లి, జీడి రైతాంగ పోరాట నాయకుడు, పలాస

దిగుబడులు లేవు..



మా గ్రామంలోకే వచ్చి కొనుగోలు చేసిన వ్యాపారికి 80 కిలోల బస్తా పిక్కలను రూ.13వేలకు అమ్ముకున్నాను. నాకు 4 ఎకరాల జీడి తోట వుంది. మొత్తం 12 బస్తాల పిక్కలయ్యాయి. ఇంట్లో నిల్వ ఉంచుకోవడం కంటే అమ్మేయడమే మంచిదని అమ్ముకున్నాను. పెట్టుబడులకు తగ్గ దిగుబడులు రాలేదు.

– మోస బాలమ్మ, జీడి రైతు, ఎర్రముక్కాం, సోంపేట మండలం

16 నుంచి జీడి కార్మికుల సమ్మె


ఎమ్మెల్యేకు సమ్మె నోటీసు అందిస్తున్న జీడి కార్మిక సంఘ నాయకులు

కాశీబుగ్గ: జీడి పరిశ్రమల్లో పనిచేసే అన్ని రకాల కార్మికులు ఈ నెల 16 నుంచి సమ్మె చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు కాష్యూ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం ఈ నెల 16తో రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పలాస కాష్యూ మాన్యుఫ్యాక్షర్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపామని, వారు పాత వేతనాలే ఇస్తామని చెబుతుండటంతో సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. వేతనాలు పెంచే వరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీ, డీసీఎల్, ఏసీఎల్, కాశీబుగ్గ సీఐలకు సమ్మె నోటీసులు అందించారు. కార్యక్రమంలో నాయకులు లొడగల కామేశ్వరరావు, బొంపల్లి సింహాచలం, కోనారి రాము, సానా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ తవ్వకాలకు నిలువెత్తు సాక్ష్యం..

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 51వ సర్వే నంబర్ సూదికొండ వెనుకభాగంలో కంకర తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరిగాయి. విద్యుత్ స్తంభం తప్ప మిగిలిన ప్రాంతాన్ని అక్రమార్కులు తవ్వకాలు జరిపి తరలించేశారు. స్తంభం కూలి ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– కాశీబుగ్గ

సంస్కరణలకు సన్నద్ధం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లకు విషయపరిజ్ఞానం పెంచేలా చర్యలు
- ముగిసిన ఓరియంటేషన్ క్లాసులు
- సిలబస్‌లు, ప్రశ్నపత్రాల మార్పులపై నిష్ణాతులతో బోధన


కీపాయింట్లను వివరిస్తున్న కామర్స్ రిసోర్స్‌పర్సన్


క్లాసులు వింటున్న అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులు ముగిశాయి. జాతీయ విద్యావిధానం, జాతీయస్థాయిలో జరిగే పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో మార్పులు-చేర్పుల ద్వారా మారిన సిలబస్‌లు, ప్రశ్నపత్రాల పేట్రన్లలో మార్పులు, రూపుదిద్దుకున్న ఇతరత్రా కొత్త అంశాలపై అధ్యాపకులకు శిక్షణను అందించారు. జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గత నెల 24న మొదలైన ఈ ఓరియంటేషన్ శిక్షణా తరగతులు గురువారం సాయంత్రంతో ముగిశాయి.

38 కళాశాలల నుంచి..

శ్రీకాకుళం జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఎంటీఎస్, పార్ట్‌టైం, కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లకు ఈ ఓరియెంటేషన్ క్లాసులు నిర్వహించారు. లాంగ్వేజ్‌లు, మ్యాథ్స్, సైన్స్, ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టుల్లో అధ్యాపకులు బోధించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మరలా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విషయపరిజ్ఞానాన్ని బోధించారు. ప్రధానమైన అంశాలపై వెబెక్స్ ద్వారా నిష్ణాతులు రిసోర్స్ పర్సన్‌గా హాజరై క్లాసులు నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలను ఇంటర్‌విద్య డైరెక్టర్ వివరించారు.

సంస్కరణలకు సహకరించాలి: డైరెక్టర్

ఇంటర్‌విద్యలో రాష్ట్రప్రభుత్వం మార్చిన సంస్కరణలకు అందరూ సహకరించి, విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేలా ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇంటర్‌విద్య డైరెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఓరియెంటేషన్ ఆన్‌లైన్ క్లాసుల్లో ఆమె మాట్లాడుతూ జూన్ 1కి బదులు ఏప్రిల్ ఒకటో తేదీనే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభించామని, ఏప్రిల్ 7 నుంచి అడ్మిషన్లను మొదలుపెట్టామన్నారు. నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఏపీ విద్యార్థులు పోటీపడేలా చేసేందుకే సిలబస్‌లలో సమూలంగా మార్పులు చేశామని, ప్రశ్నపత్రం పేట్రన్‌లో మార్పులు చేసినట్టు వివరించారు. ఐచ్ఛిక సబ్జెక్టులను ఎంపికచేసుకునే అవకాశం కూడా విద్యార్థులకు కల్పించినట్టు వివరించారు. ఐపీఈ మార్చి-2025 ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థుకు రెమీడియల్ క్లాసులు నిర్వస్తున్నామన్నారు. ఈ ఏడాది ఫస్టియర్ విద్యార్థులకు మారిన సిలబస్ ప్రకారం పాఠ్యపుస్తకాలు రానున్నాయని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం క్లాసులకు హాజరయ్యే అధ్యాపకుల హాజరు, ఏర్పాట్లు, సౌకర్యాలను ఆర్‌ఐఓ/ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగడ దుర్గారావు స్వయంగా పర్యవేక్షించారు. అధ్యాపకుల హాజరును ఇంటర్మీడియెట్ విద్య ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణనలోకి తీసుకున్నారు.

ఓరియెంటేషన్ క్లాసులు జరిగిన షెడ్యూల్	సబ్జెక్టులు
ఏప్రిల్ 24, నుంచి 26 వరకు	తెలుగు, ఇంగ్లీషు, హిందీ
ఏప్రిల్ 28, 29 తేదీల్లో	మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ
మే 5, 6 తేదీల్లో	కామర్స్, హిస్టరీ, సంస్కృతం
మే 7, 8 తేదీల్లో	సివిక్స్, ఎకనామిక్స్, జువాలజీ

విజయవంతంగా ముగిశాయి..

శ్రీకాకుళంలో గత నెల 24 నుంచి మే 8వ తేదీ వరకు 13 సబ్జెక్టుల్లో అధ్యాపకులకు నిర్వహించిన ఓరియెంటేషన్ క్లాసులు విజయవంతంగా ముగిశాయి. దాదాపు అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు క్లాసులకు హాజరయ్యారు. ఇంటర్‌విద్య డైరెక్టర్ అనేక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మారిన సిలబస్, పేట్రన్ ప్రకారం రిసోర్స్‌పర్సన్లు పలు కీ పాయింట్లను లెక్చరర్లకు వివరించారు.

– ప్రగడ దుర్గారావు, ఆర్ఐఓ, శ్రీకాకుళం

కుట్టు మిషన్ల శిక్షణ పేరిట మోసం


రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పేరుతో కూటమి ప్రభుత్వం రూ.150 కోట్లు మోసానికి పాల్పడుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం బలహీన వర్గాలకు చెందిన మహిళలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభం నాటికే భారీ మోసానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. 1,02,832 మంది మహిళలకు శిక్షణ కోసం రూ.221.08 కోట్లు నిధులు కేటాయించారని, ఒక్కొక్క కుట్టు మిషన్ రూ.4,300, కుట్టు శిక్షణ కోసం మహిళకు రూ.3 వేలు ఖర్చు అవుతుందన్నారు. వాస్తవ వ్యయం రూ.750 కోట్లు మాత్రమే ఉంటుందన్నారు. మిగిలిన డబ్బులు ఎవరి ప్రయోజనం కోసం ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో ఆదరణ పథకం పేరుతో చేతి వృత్తులు, కుల వృత్తులు వారిని మోసం చేయటంతో పాటు భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పుడు కుట్టు శిక్షణ, మిషన్ల పేరుతో అవినీతికి పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళల ఆర్థిక ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేశారు.

అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి


సమస్యలు వింటున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే

పాతపట్నం: ప్రజలు ఇచ్చే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. తాగునీరు, పింఛన్, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ తదితర సమస్యలపై పలువురు దరఖాస్తులు అందజేశారు. పాతపట్నంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం మద్యం షాపును తొలగించాలని స్థానిక మహిళలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డ్వామా పీడీ బి.సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ద్వారకపురంలో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో చంద్రకుమారి, సర్పంచ్ అన్నెపు సుజాత తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఇప్పిలి గ్రామంలో బుధవారం జరిగిన హత్య కేసులో నిందితుడు ఇప్పిలి రమణ రూరల్ పోలీసులుకు లొంగిపోయాడు. గురువారం ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. కన్నం నర్సింగరావును ఉద్దేశపూర్వకంగానే బలమైన ఆయుధంతో (కత్తవ) పొడిచి చంపాడని, ఆయుధాన్ని సైతం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

తాటిచెట్లపాలెం(విశాఖ): భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి లుకలపు తిరుపతిరావు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టెక్కలికి చెందిన శ్రావణిని బి.మాధవరావుకు ఇచ్చి వివాహం చేశారు. అనంతరం శ్రావణి కోరిక మేరకు ఆమెను విశాఖలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదివించారు. ఈ సమయంలో శ్రావణికి కొమర రోహిత్‌కుమార్‌తో స్నేహం ఏర్పడి, అది సన్నిహిత సంబంధానికి దారితీసింది. పెద్దల సమక్షంలో మాధవరావుతో విడాకులు తీసుకున్న శ్రావణి, ఆ తర్వాత రోహిత్‌కుమార్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో వివాహం చేసుకుంది. వివాహం తర్వాత రోహిత్ ప్రవర్తనలో మార్పు రావడంతో శ్రావణిని వేధించడం ప్రారంభించాడు. రోహిత్‌కుమార్ భార్యను పోషించలేక ఆమె సంపాదించి తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. సొంత ఖర్చులు కూడా ఆమెనే భరించాలని వేధించేవాడు. రోహిత్‌కుమార్ విశాఖ-హైదరాబాద్ తిరుగుతూ విశాఖ వచ్చినప్పుడల్లా వేధించేవాడు. పెళ్లయిన తర్వాత తనకు మనశ్శాంతి లేదని, చనిపోతే సంతోషంగా ఉంటానని రోహిత్ కుమార్ పదే పదే అనడంతో శ్రావణి తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. ఈ నెల 5న శ్రావణి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లగా, పోలీసులు గుర్తించి ఆమె సోదరుడికి సమాచారం అందించారు. అనంతరం రోహిత్ కుమార్ ఆమెను హాస్టల్‌లో వదిలి వెళ్లిపోయాడు. బుధవారం శ్రావణి మత్తు మాత్రలు మింగడంతో మృతి చెందింది. తన కుమార్తెకు మృతికి కారణమైన రోహిత్‌కుమార్ చర్యలు తీసుకోవాలని శ్రావణి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువగళం హామీలు ఏమయ్యాయి?


నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పేరిట విద్యార్థుల కోసం అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి మండిపడ్డారు. ఏడాది కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పందించకపోవడం దారుణమన్నారు. యువగళం హామీలు ఏమయ్యాయంటూ జిల్లా కేంద్రంలోని సూర్యమహల్ కూడలిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ లోకేష్ విద్యాశాఖ మంత్రి కాదని, ఫేక్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. విద్యా సంసవత్సం బకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మదన్, శ్రీకాకుళం మండల కన్వీనర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో జలయాత్ర

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు పురుషోత్తపురంలో విశ్వశాంతి ఏకకుండి వైష్ణవ మహాయజ్ఞంలో భాగంగా మహిళలంతా కలిసి జలయాత్ర చేపట్టారు. గురువారం బాహుదా నదిలో మంత్రోచ్ఛారణలతో గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలతో నదీజలాలను ఊరేగింపుగా పురుషోత్తపురం గ్రామానికి తీసుకొచ్చారు. -ఇచ్ఛాపురం